క్లుప్తంగా

వాటర్ బాటిళ్ల పంపిణీ

తాడూరు: మండలంలోని ఆకునెల్లికుదురు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ ఇప్సాన్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని విద్యార్థులకు వాటర్ బాటిళ్లతో పాటు చెస్ బోర్డులు, రింగ్‌బాల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఆ క్లబ్ అధ్యక్షుడు వాస రాఘవేందర్, పంచాయతీ కార్యదర్శి శివ, ఉపాధ్యాయురాలు జ్యోతి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

తాడూరు: మండల కేంద్రంలో నిర్మిస్తున్న చెన్నకేశవ ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన మేస్త్రీ వంక నారాయణ రూ.50 వేలు విరాళంగా మంగళవారం మాలమహానాడు నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో పర్వతాలు, చింత సత్తి, వెంకటయ్య, చంద్రయ్య, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

కోడేరు: విద్యుత్ పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఏఈ రాకేష్, ప్రభాకర్‌లు కోరారు. ప్రజాపాలనలో భాగంగా గృహజ్యోతి పథకం అమలు వచ్చే నెల నుంచి ప్రారంభం అవుతుందని పాత బకాయిలు ఏమైనా ఉంటే ఈ నెల 29 తేదిలోగా చెల్లించాలని పేర్కొన్నారు. పాత బకాయిలు ఉంటే పథకానికి అర్హులు కారని వివరించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే జరిమానా



పెంట్లవెల్లి: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే జరిమానా విధిస్తామని ఎస్‌ఐ రామన్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడుపొద్దని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతలకు ఎవరైన విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని వివరించారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

డీఎస్పీకి సన్మానం



కల్వకుర్తి: పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న డీఎస్పీ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ వెంకటేశ్వర్లును ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డితోపాటు సిబ్బంది సన్మానించారు. ఇంటర్ పరీక్షలకు భద్రతా చర్యలపై చర్చించారు. పరీక్షలకు అరగంట ముందుగా ఎగ్జామ్ కస్టోడియన్ అధికారి వాటిని ఆయా పరీక్షా కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకున్నట్లుగా సురేందర్ రెడ్డి పోలీసులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు ఉన్నారు.

ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలి

చారకొండ: జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్‌కు మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని ఉద్యమ నాయకులు విక్రమ్ గౌడ్, అంకిల్ల మల్లికార్జున్, మంగళవారం ఒక్క ప్రకటనలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని కోరారు.

అడవి జంతువు దాడిలో ఆవుదూడ మృతి

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన రైతు గంటల లక్ష్మయ్యకు సంబంధించిన ఆవుదూడను సోమవారం అడవి జంతువు దాడి చేసి చంపింది. స్థానికుల వివరాల ప్రకారం రైతు ఆవుదూడకు పొలంలో కట్టేసి ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చేసరికి ఆవుదూడ మృతిచెందినట్లు రైతు తెలిపాడు. ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వడంలో వారు ఘటన స్థలానికి చేరుకోని అడవిజంతువు ముద్రలను సేకరించారు. హైనా దాడిచేసినట్లు వారు గుర్తించారు. పశువైద్య అధికారులు పోస్టుమార్టం నిర్వహించారు.

మధ్యాహ్న భోజనం నిర్వాహకుల నిరసన

లింగాల: మండలంలోని కోమటికుంట ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజనం వండకుండా ఏజెన్సీ వారు నిరసన వ్యక్తం చేశారు. పాఠశాలకు చెందిన లోకేశ్వరీ విద్యార్థిని మధ్యాహ్న భోజనం తిని అస్వస్థతకు గురైనట్లు కొంత మంది తప్పుడు ఆరోపణలు చేశారని వంట ఏజెన్సీ వారు ఆందోళన వ్యక్తం చేశారు. భోజనాన్ని పాఠశాలకు చెందిన విద్యార్థులు అందరు తిన్నారని, ఎవరికి ఏమి కాలేదని, మరి ఒక్క విద్యార్థిని ఎలా అస్వస్థతకు గురవుతారని ప్రశ్నిస్తున్నారు. పాఠశాలలో నెల కొన్న పరిస్థితులపై గ్రామస్తులు జోక్యం చేసుకున్నారు. వాస్తవాలు తెలియకుండా తప్పుడు ఆరోపణలు చేయడాన్ని హెచ్‌ఎం అంజిలాల్‌తో పాటు గ్రామస్తులు తీవ్రంగా ఖండించారు.

మొక్కలు ఎండకుండా చర్యలు



వెల్దండ మండలం కొట్రలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి

వెల్దండ: నర్సరీల్లో మొక్కలు ఎండకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కొట్రలో నర్సరీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 32 గ్రామ పంచాయతీల్లో ఉన్న నర్సరీలల్లో మొక్కల పెంపకం చేపడుతున్నామన్నారు. నర్సరీలల్లో వందశాతం మొక్కలను పెంచి రైతులకు అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు, కార్యదర్శులకు సూచించారు. వేసవి కావడంతో మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలంకరణ కోసం పూలమొక్కలు, పండ్ల మొక్కలు నర్సరీలో అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏపీఓ ఈశ్వర్, టీఏలు రాజ్‌కుమార్, సత్యనారాయణ, కార్యదర్శి బాలస్వామి, ఫీల్డ్‌అసిస్టెంటు చెన్నయ్య తదితరులు ఉన్నారు.

నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ

చారకొండ: నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ అన్నారు. మండలంలోని గోకారం, చంద్రాయన్‌పల్లి గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను పరిశీలించి, నర్సరీలో మొక్కల పెంపకం, వాటి సంరక్షణ తీసుకోవాల్సిన జాగ్రత్తలను నిర్వాహకులకు సూచించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని మొక్కలకు నీరు అందించాలని కోరారు. నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే పంచాయతీ కార్యదర్శి, సంబంధిత చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డుల తనిఖీ చేశారు. వారి వెంట ఎంపీఓ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



చారకొండలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పెద్దకొత్తపల్లి: గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్య, సిబ్బందిని పెంచాలని ఏపీఓ మంజుల అన్నారు. మండలంలోని జొన్నలబొగుడ గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కాలం సమీపించడంతో కూలీలందరికి పనులు కల్పించి పనుల వద్ద తాగునీటి వసతి కల్పించాలన్నారు. మండలంలో ప్రతి రోజు 600 మంది పనిచేస్తున్నారు. వీరి సంఖ్యను పెంచాలని ఆమె సూచించారు. చెరువుకట్టపై ఉన్న ముళ్లపొదల తొలగింపు పనులను పరిశీలించారు.

చారకొండ: గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్యను పెంచే విధంగా ఉపాధి అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ ఏపీఓ, ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లను కోరారు. మంగళవారం చంద్రాయన్‌పల్లిలో ఉపాధి కూలీల పని ప్రదేశంలో కూలీలు చేపట్టిన ఉపాధి పనులను పరిశీలించారు. పనుల్లో కూలీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కూలీల వివరాలను తప్పనిసరిగా మాస్టర్ రోల్‌లో హాజరు నమోదు చేయాలని సూచించారు. పనుల్లో నాణ్యతను పాటించాలని కోరారు. కూలీలను మరింత పెంచే విధంగా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు. వారి వెంట ఉపాధి అధికారులు, తదితరులు ఉన్నారు.

ఉప్పునుంతల: జాతీయ ఉపాధిహామీ పథకంలో రైతులకు, కూలీలకు ప్రయోజనం చేకూరే పనులు చేపట్టాలని ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు సూచించారు. మంగళవారం మండలంలోని గువ్వలోనిపల్లి, పెనిమిళ్ల గ్రామ పంచాయతీల్లో కొనసాగుతున్న ఈజీఎస్ పనులను ఎంపీడీఓ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కూలీల మస్టర్ కాపీలను ఆయన తనిఖీ చేశారు. పనుల వద్ద ఎంపీడీఓ కూలీలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. చేసిన పనులకు సకాలంలో డబ్బులు రావడంలేదంటూ కూలీలు ఎంపీడీఓతో ఆవేదన వ్యక్తంచేశారు. ఏపీఓ సుదర్శన్‌గౌడ్, టీఏ సింగోటం, ఫీల్డ్ అసిస్టెంట్లు రాము, కిరణ్, కూలీలు పాల్గొన్నారు.

భోజన వసతి కల్పించాలని ధర్నా



ధర్నాలో పాల్గొన్న విద్యార్థులు

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాల విద్యార్థులు బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకుడు శేఖర్ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు హాస్టల్ వసతులు కల్పించారని, భోజన వసతి కల్పించలేదన్నారు. ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా వారు పట్టించుకోవడం వాపోయారు. భోజన వసతులు లేని కారణంగా చాలా మంది విద్యార్థులు పీజీ విద్యకు దూరమవుతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 2,152 అధ్యాపకుల పోస్టులను వెంటనే భర్తీచేయాలన్నారు. ప్రతి యూనివర్సిటీకి మెయింటనెన్స్ నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



లింగాల: ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని పాత రాయవరంలో ఆంజనేయస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే ఆలయాన్ని సందర్శించి ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేశారు. దాతల సహకారంతో ఆలయ పునఃనిర్మాణం చేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఉత్సవాల నిర్వాహకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఈ కేవైసీ నమోదుకు గడువు పెంచాలి



మాట్లాడుతున్న విజయ్

తాడూరు: రేషన్ షాపుల్లో ఈ కేవైసీ నమోదుకు గడువు పెంచాలని బీఎంపీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ విజయ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 29 వరకు ఈ కేవైసీకి గడువు ముగియనుండటంతో గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడుతారన్నారు. చిన్నారుల వేలిముద్రలు అప్‌డేట్ కాకపోవడంతో రేషన్‌కార్డుదారులు ఆందోళన చెందుతున్నారని వాపోయారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్ దగ్గర జనం రద్దీగా ఉండడం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఈ కేవైసీ కోసం మరో రెండు నెలల పాటు గడువు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం నాయకులు జెట్టి చంద్రయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

కళాశాలకు ఇన్వర్టర్ అందజేత



కల్వకుర్తి టౌన్: పట్టణంలోని ప్రభుత్వ మాడల్ డిగ్రీ కళాశాలకు మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.20 వేల విలువగల నూతన ఇన్వర్టర్ బ్యాటరీని ఫౌండేషన్ సభ్యులు కళాశాల ప్రిన్సిపాల్ డా.శార్వాణికి మంగళవారం అందజేశారు. కరెంటు లేని సమయంలో విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు బహూకరించినట్లు సభ్యులు తెలిపారు. మిత్ర ఫౌండేషన్ సభ్యులను కళాశాల ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో మిత్ర ఫౌండేషన్ సభ్యులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం



తెలకపల్లిలో పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు



అచ్చంపేటలో

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆంజనేయులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం మేనిఫెస్టోగా ఆచరించే ఏకైక పార్టీ తమదేనన్నారు. కార్యక్రమంలో చందు, రాజు స్వామాట్, భాస్కర్, రమేష్, మహేష్, మల్లేష్, మహేష్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలకపల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడుదామని నాగర్‌కర్నూల్ జిల్లా అసెంబ్లీ ఇన్‌చార్జ్ చింతకుంట్ల కల్యాణ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని నెహ్రూ చౌరస్తాలో బీఎస్పీ ఆధ్వర్యంలో నాయకులు పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కల్యాణ్ మాట్లాడుతూ దేశ పౌరులందరికి స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం, లౌకికవాదం అంశాలు ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో రాంచందర్, మండలాధ్యక్షుడు శివశంకర్, బాలనాగయ్య, శశికుమార్, రాజేష్, శ్రీకాంత్, బాలకృష్ణ, భానుప్రసాద్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: భారత రాజ్యాంగమే మేనిఫెస్టో కలిగిన ఏకైక పార్టీ బీఎస్పీ అని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ యేసేఫ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా యేసేఫ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కొన్ని పార్టీలు రాజ్యాంగాన్ని భ్రష్టు పట్టించాలని చూశాయని ఆరోపించారు. బీఎస్పీ రాజ్యాంగాన్ని కాపాడుతుందన్నారు. బాబు, మల్లయ్య, కృపానందం, కృష్ణ, శేఖర్ పాల్గొన్నారు.

విజ్ఞాన మేళాతో సృజనాత్మకత



రాకెట్ ప్రయోగంతో విద్యార్థులు

కల్వకుర్తిరూరల్: విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యత, సృజనాత్మకత వెలికితీసేందుకు విజ్ఞాన మేళా దోహదపడుతుందని రఘుపతిపేట జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం అంజయ్య అన్నారు. మంగళవారం మండలంలోని పంజుగుల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విజ్ఞాన మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రయోగశాల పద్ధతిలో పాఠ్యాంశాలను పూర్తి స్థాయిలో అవగతం అవుతాయన్నారు. విద్యార్థుల జ్ఞాపకశక్తి మెరుగవుతుందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు నమూనాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో భారత జాగృతి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు దారమోని గణేష్, కార్యదర్శి కృష్ణ, ఉపాధ్యాయుడు కృష్ణయ్య, పుష్పలత, ఉమాదేవి, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



కుర్మిద్ద ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు

కల్వకుర్తిరూరల్: మండలంలోని కుర్మిద్ద ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్‌ఎంగా అశ్విని, ఎంఈఓగా చిన్నారితో పాటు పలువురు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయురాలు అనిత, అంగన్‌వాడీ టీచర్ వసంత తదితరులు పాల్గొన్నారు.



పస్పుల పాఠశాలలో

కోడేరు: మండలంలోని పస్పుల యూపీఎస్ పాఠశాలలో విద్యార్థులు మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. హెచ్‌ఎం జగదీశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సహాయక పోలింగ్ స్టేషన్ల పరిశీలన



ఫిరట్వానిపల్లి తండాలో పోలింగ్ స్టేషన్ కోసం ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్

ఉప్పునుంతల: పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని గతంలో ఉన్న పోలింగ్ స్టేషన్లకు రెండు కిలోమీటర్లకు పైబడి ఉన్న గ్రామాల్లో కొత్తగా సహాయక పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు కోసం మంగళవారం తహసీల్దార్ శ్రీకాంత్ విచారణ చేశారు. మండలంలోని సీబీ తండా, పూర్యానాయక్ తండా, ఈరట్వానిపల్లి, అయ్యవారిపల్లి తండా, ఫిరట్వానిపల్లి తండా, తిప్పాపూర్ తదితర గ్రామాల్లో పాఠశాల, ఇతర ప్రభుత్వ భవనాలను ఆయన పరిశీలించారు. మండలంలో మొత్తం 12 గ్రామాల్లో సహాయక పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు కోసం పరిశీలించినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ఏఆర్‌ఐ రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

భౌతికకాయం ఇచ్చేందుకు అంగీకారం



నాగర్‌కర్నూల్ క్రైం/తాడూరు: మండలంలోని సిర్సవాడ గ్రామానికి చెందిన జల్లి ఉదయ్ కుమార్ అనే యువకుడు తన మరణానంతరం పార్థివ దేహాన్ని మెడికల్ కళాశాల ఇచ్చేందుకు మంగళవారం మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మహితకు అంగీకార పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నూతన పరిశోధనల కోసం ఇబ్బందులు రాకుండా తన శరీరాన్ని అప్పగించేందుకు అంగిరించినట్లు పేర్కొన్నారు. గతంలోనూ తన మాతృమూర్తి భౌతికకాయాన్ని మెడికల్ కళాశాలకు అందజేశానని తెలిపారు.

పాలాభిషేకం



వీపనగండ్ల: మండలంలోని కల్వరాలలో మంగళవారం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో మరో రెండింటిని ప్రారంభించడంతో పార్టీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లికృష్ణారావు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. మహిళలకు ఉచిత బస్సుతో పాటు ఆరోగ్య శ్రీ పథకాన్ని అమలులోకి తెచ్చిన ప్రభుత్వం, మహిళలకు రూ.500లకే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే పథకాలకు శ్రీకారం చుట్టడంపై హర్షం వ్యక్తం చేశారు.

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

అచ్చంపేట రూరల్: ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని తెలంగాణ మజ్దూర్ యూనియన్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ మోహన్‌లాల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని టీఎంయూ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగులు పలు సమస్యలను ఆయనకు వివరించారు. తార్నాక ఆస్పత్రిలో ప్రత్యేకంగా రిటైర్డ్ ఉద్యోగుల కోసం సేవలు అందించేందుకు నిధులను కేటాయించాలన్నారు. పింఛన్ సమస్యలతో సతమతమవుతున్నామని పేర్కొన్నారు. అనంతరం మోహన్‌లాల్ మాట్లాడుతూ సమస్యను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకు వివరిస్తానని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా చూస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు ముజఫర్ హుస్సేన్, సాయిబాబు, జంగయ్య, శ్రీను కేపీఎల్, కేఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



మోడల్‌హైస్కూల్‌లో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

కల్వకుర్తి టౌన్: ఇంటర్ పరీక్షలకు పట్టణంలోని 7 పరీక్షా కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లుగా కల్వకుర్తి పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ సురేందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అన్ని పరీక్షా కేంద్రాలలో నిమిషం నిబంధన వర్తిస్తుందని, విద్యార్థులు పరీక్షా సమయం కన్నా అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఆయన సూచించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 1,568, ద్వితీయ సంవత్సరంలో 1,258 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని వివరించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ హైస్కూల్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పరీక్ష నిర్వాహకులు సంజీవ్‌రెడ్డి, పుష్పలతలు పేర్కొన్నారు. ఈ నెల 28న నుంచి ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసిన తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరం విద్యార్థులు 162, రెండో సంవత్సర విద్యార్థులు 154 పరీక్షలకు హాజరవుతారని పేర్కొన్నారు. అదేవిధంగా మోడల్ హైస్కూల్ ప్రథమ సంవత్సర విద్యార్థులు 222 మంది, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 189 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని వివరించారు.

కోడేరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన్నట్లు చీఫ్ సూపిరింటెండెంట్ శేఖర్ తెలిపారు. కోడేరు, పెద్దకొత్తపల్లి విద్యార్థులు మొత్తం 391 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని పేర్కొన్నారు.

అర్హులందరికీ గ్యారంటీ పథకాలు ఇవ్వాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: రేషన్ కార్డుతో సంబంధం లేకుండా గ్యారంటీ పథకాలు అందించాలని సీపీఎం మండల కార్యదర్శి జి అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రూ.500లకు సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు సుభాష్, వెంకటేష్, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డులు మంజూరు చేయాలి

కోడేరు: అర్హులందరికి రేషన్‌కార్డులు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి నరిసింహ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశం ఆయన మాట్లాడారు. తక్షణమే అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ఎండీ మాలిక్, వెంకటమ్మ, రవి, శివశంకర్ వరప్రసాద్, మరాటి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

శివ మాలధారులకు అన్నదానం



భిక్ష స్వీకరిస్తున్న శివస్వాములు

కందనూలు: జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ బస్‌స్టాప్ ఎదురుగా లలితా సహస్ర నామ సేవా సమితి, ఆకారపు కుమారస్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీశైల పాదాచార శివ స్వాములకు, భక్తులకు పండ్లు, అన్నప్రసాద పంపిణీ చేశారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి కాలినడకన వెళ్లే శివ స్వాములకు శివరాత్రి వరకు ప్రతిరోజు ఉదయం సమయంలో పండ్లు, మధ్యాహ్నం అన్నప్రసాదం, సాయంత్రం వేళలో పండ్లు, అల్పాహార పంపిణీ చేస్తామని లలితా సహస్ర నామ సేవా సమితి అధ్యక్షురాలు కొత్త రేవతి పేర్కొన్నారు.

స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించాలి

ఉప్పునుంతల: మల్టీజోన్–2 లో స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్ ముదిరాజ్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. గత కొన్నేళ్లుగా పదోన్నతులు లేకపోవడంతో ఎంతోమంది అర్హులైన ఉపాధ్యాయులకు నష్టం చేకూరుతుందని పేర్కొన్నారు. పదోన్నతులకు సంబంధించి హైకోర్టులో కేసును ఎత్తివేసిన నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే పదోన్నతులకుల సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వం ప్రకటించాలని కోరారు.